క్లుప్తంగా

మొగిలిలో రాహుకేతు పూజలు


రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం రాహుకాల సమయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాహుకాల పూజల్లో పాల్గొని దోష నివారణ పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: వేసవికాలం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగలాంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని వెంటను సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి


రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఇంటింటికీ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 35 మంది రోగులకు పరీక్షలు చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు వృద్ధులకు పరీక్ష చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్

గుడిపాల: ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని పానాటూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది ప్రియాంక, వీరలక్ష్మి, భారతి, కోకిల పాల్గొన్నారు.

సచివాలయాల్లో స్పందనకు చెల్లు చీటీ

- మండల, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి సర్కారు నిర్లక్ష్యం

గుడిపాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి 2వేల కుటుంబాలకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం అమలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయ అధికారులందరూ స్పందనకు హాజరయ్యేవారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా స్థానికంగా రోజూ గంటపాటు నిర్వహించి ప్రజల నుంచి సమస్యల వినతిపత్రాలు స్వీకరించేవారు. దీంతో జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీనికి పేరు మార్చి మండల స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ప్రజలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రంలో సరైన స్పందన లేకపోతే జిల్లా కలెక్టరేట్‌కు పరుగులు తీసి తమ సమస్యలు నివేదించుకోవాల్సి వస్తోంది.

తిష్ట వేస్తున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలామంది సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తుండడంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు.



గ్రామ సచివాలయం

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానుపోనూ బస్సు చార్జీలు పెట్టుకోవాల్సి వస్తుంది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామ స్థాయిలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– రాజేష్, స్థానికుడు, గుడిపాల

స్పందన కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే సచివాలయాల్లో స్పందన (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేయాలి.

– రేణుకుమార్, స్థానికుడు, గుడిపాల

నోటీస్ బోర్డు

విద్యుత్ గ్రీవెన్స్ రేపు

- **చిత్తూరు కార్పొరేషన్:** వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలను తెలుపవచ్చన్నారు. సమస్యలను వినతిరూపంలో ఇవ్వాలని వివరించారు.

నేడు మెగా వైద్య శిబిరం

- **తవణంపల్లె:** మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు జగన్నాథం, కార్యదర్శి అనంతకుమార్, కోశాధికారి జీవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండల ప్రెస్‌క్లబ్(ఏపీయూడబ్ల్యూజే అనుబంధం) ఆధ్వర్యంలో అరగొండ అపోలో హాస్పిటల్, తవణంపల్లె పీహెచ్‌సీ వైద్య బృందం సహకారంతో ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా సెక్షన్ల వారీగా ఈఈ మునిచంద్ర ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు నగరంలో మొత్తం 14 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని గుర్తించామన్నారు. వీటికి పాలన పరంగా అనుమతులు వచ్చాయని చెప్పారు. కాజూరులో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీ పెట్టామన్నారు. తేనబండలో 25 కేవీ స్థానంలో 63 కేవీ, దర్గామిట్టలో 16 కేవీ స్థానంలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. సంజయ్‌గాంధీనగర్, డీఐరోడ్డు, మిట్టూరు, ఇరువారం, ఇందిరానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మెటీరియల్ వచ్చాక వీటిని బిగించనున్నమన్నారు. ఏఈలు తమ సెక్షన్ల పరిధిలో లైన్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా లైన్ మెయింటెనెన్స్ పనులు చేయించాలన్నారు. గిరింపేట సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నామని వివరించారు.


కాజూరులో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

రీసర్వే సమస్యలు పరిష్కరించండి

యాదమరి: గ్రామ సభల్లో భూముల రీసర్వేపై వచ్చిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల తహసీల్దార్ పార్థసారథి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత గ్రామ సభల్లో వచ్చిన 1000 ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు 600 వరకు పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని కూడా వెంటనే పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

స్వీపర్ల జీతాలు బ్యాంకులో జమ చేయండి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, ఆయాలకు వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులోని కార్మికుల సమావేశం సోమవారం సంతపేటలో నిర్వహించారు. ఉద్యోగులకు రాష్ట్రం మొత్తం వాళ్ల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తుంటే.. చిత్తూరు కార్పొరేషన్ అధికారులు చేతికి డబ్బులు ఇవ్వడం అవినీతికి ఆజ్యం పోసినట్లేనన్నారు. స్వీపర్లు, ఆయాల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయకుమారి మాట్లాడుతూ వేతనాలతో పాటు కార్మికులకు యూనిఫామ్, క్లీనింగ్ మెటీరియల్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు భువనేశ్వరి, ప్రభావతి, రమేష్, సెల్వి, మేరి తదితరులు పాల్గొన్నారు.


స్వీపర్లు, ఆయాలతో కలిసి మాట్లాడుతున్న నాగరాజన్

ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారించాలి

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలు, వాళ్లు ఇచ్చే వినతులు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడ్డ వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించాలన్నారు. ఇతర వినతులను తక్షణం పరిశీలించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు తీసుకుంటున్న కమిషనర్

కుట్టు మిషన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

బంగారుపాళెం: మండలంలోని మహిళలు కుట్టుమిషన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ సోమవారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళా లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18–50 ఏళ్ల వయసు గల వారు అర్హులని తెలిపారు. తెల్లరేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆయా గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 45, 60, 90 రోజుల్లో శిక్షణ పొందేందుకు అవకాశం ఉందన్నారు. శిక్షణ తరగతుల్లో 75 శాతం హాజరు కలిగిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టుమిషన్ అందజేయనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూదం ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జూదమాడుతున్న ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని పుత్తూరు రోడ్డులో ఉన్న సీకే పల్లి వద్ద పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వన్ టౌన్ పోలీసులు సీకే పల్లి వద్ద దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఐరాలలో వంద శాతం హాజరు


బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు


తవణంపల్లె : పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్‌టికెట్లను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

ఐరాల: మండల వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గంట ముందుగానే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు తెలుగు పరీక్షకు 319 మందికి గాను 319 మంది హాజరైనట్లు ఎంఈఓ రుషేంద్రబాబు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో పాటు తాగునీటి సౌకర్యం, తరగతి గదిలో వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

10 మంది విద్యార్థుల గైర్హాజరు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మొత్తం 808 మంది విద్యార్థులకు గాను 798 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. 10 మంది విద్యార్థులు గైహాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు.

నలుగురు గైర్హాజరు

తవణంపల్లె: మండలంలోని అరగొండ, తవణంపల్లెలోని పరీక్ష కేంద్రాల్లో ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అరగొండ హైస్కూల్లోని పరీక్ష కేంద్రంలో 211 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 207 మంది విద్యార్థులు హాజరయ్యారు. తవణంపల్లె హైస్కూల్లోని పరీక్షా కేంద్రాలను డీఈఓ వరలక్ష్మి తనిఖీ చేశారు.




ఐరాల: పరీక్ష కేంద్రాలకు వెళుతున్న విద్యార్థినులు , తవణంపల్లె : పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు, బంగారుపాళెం: పరీక్ష కేంద్రంలో గదుల నంబర్లను చూస్తున్న విద్యార్థులు

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారురాలు అయిన **శ్రీమతి ఎస్.తన్వీర్ సుల్తానా W/o షేక్ జావిద్ బాషా,డోర్‌నెం.19-240/4,రెడ్ క్రాస్ స్ట్రీట్ ఎక్స్టెన్షన్, మిట్టూరు, చిత్తూరు** అను వారు దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని కొనదలిచి సదరు ఆస్తి యజమాని అయిన **శ్రీ ఆర్.సురేష్ బాబు, S/o రాజేంద్రన్, మాదిపరం, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా** అను వారి వద్దనుండి అగ్రిమెంటు చేసుకొని ఉన్నారు. కాగా సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ మూల పత్రములు కొన్ని దారి పోయిన దనియు, సదరు డాక్యుమెంటు ఎంత వెతికినా దొరకలేదని సదరు ఆస్తి యజమాని తెలిపి ఉన్నారు.కావున సదరు డాక్యుమెంటు ఎవరి వద్దనైన ఉన్న ఎడల లేక ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి పై ఎవరికైనా ఏ విధమైన హక్కులు గాని, అడమానములు, అగ్రిమెంట్లు, క్లైయిములు,కోర్టు అటాచ్ మెంట్లు, ఇంకేదైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ దినము నుండి 15 రోజుల లోపు నాకు గాని లేక పై తెలిపిన నా కక్షిదారుకు గాని తగు రుజువులతో వ్రాతపూర్వకముగా తెలుపవలసినదిగా కోరడమైనది. గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రాని యెడల నా కక్షిదారు నిరభ్యంతరముగా ఆస్తిని రిజిష్టరు చేసుకొనుదురు. గడువు మీరిన తర్వాత వచ్చు అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యత వహించరు.

షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్టు – చిత్తూరు సబ్ డిస్ట్రిక్టు, చిత్తూరు మండలం, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, నెం.72 చిత్తూరు గ్రామ లెక్క దాఖలా సర్వార్ పుంజ సర్వే నెం.635/1 గా గల భూమి లో గల ఇంటి ఖాళీ జాగాలకు చెక్కుబంది.

1 అయిటము : ఉత్తరం : శ్రీ కింది 2 వ అయిటము గల జాగా, దక్షిణము : డోర్ నెం.19-269/1 గా గల భవనము, తూర్పు : 30 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర : ఎ.రఘుపతి నాయుడు గారి డోర్ నెం.19-286/2ఏ గా గల ఇల్లు.

ఈ చెక్కుబందీల మధ్య తూర్పు పడమర ఉత్తర దిశన 99 అడుగులు, తూర్పు పడమర దక్షిణ దిశన 101 అడుగులు ఉత్తర దక్షిణం 30 అడుగులు. పూరా విస్తీర్ణం 3000 చదరపు అడుగుల ఖాళీ జాగా

2 అయిటము : ఉత్తరం : రఘుగారి ఇల్లు, దక్షిణము : పై కనిన 1వ అయిటముగా గల జాగా, తూర్పు :30 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర : వెంకటేశులు నాయుడు గారి డోర్ నెం.19-286/2 మరియు ఎ.పూర్ణిమ గారి డోర్ నెం.19-286/3ఎ గా గల ఇల్లు. ఈ చెక్కుబందీల మధ్య తూర్పు పడమర ఉత్తర దిశన 90 అడుగులు,తూర్పు పడమర దక్షిణ దిశన 93 అడుగులు ఉత్తర దక్షిణం 42 అడుగులు. పూరా విస్తీర్ణం 3843చదరపు అడుగుల ఖాళీ జాగా. రెండు అయిటముల మొత్తం విస్తీర్ణం 6843 చదరపు అడుగులు లేక 760.33 చదరపు గజముల ఖాళీ జాగా.

కె.శివాజీ, అడ్వకేట్, 10-174, కెడిసి బిల్డింగ్స్ ఎదురుగా, గాంధీరోడ్ ఎక్స్టెన్షన్, చిత్తూరు

అడవికి నిప్పు



గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టిన సంఘటన శ్రీరంగరాజపురం మండల పరిధిలోని మెదవాడ అటవీ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, మెదవాడ సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పదేళ్ల క్రితం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి వంద హెక్టార్లలో పెంచిన ఎర్రచందనం, నీలగిరి చెట్లు దగ్ధమయ్యాయి. వాటి విలువ కోట్లలో ఉంటుంది. ఇంత జరిగినా కనీసం అటవీశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– కార్వేటినగరం

తాంబూలం.. కటకటా!



తాంబూల ప్రియులకు ఇది షాకింగ్ వార్తే. రోజూ ఎర్రటి నోటి కోసం ఆకు, వక్కా నమిలే వాళ్లు ఆకాశాన్నంటుతున్నా తమలపాకు ధరలతో ఇక నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి కలుగుతోంది. ఈనెల 1న కట్ట తమలపాకుల కట్ట రూ.170 వరకూ ఉండగా ఇప్పుడు కట్ట తమలపాకులు(వంద ఆకులు) ధర రూ.300 దాటింది. ప్రస్తుతం కర్ణాటక నుంచి ఇక్కడికి తమలపాకులు వస్తున్నాయి.

– పలమనేరు